60th Year of Publication ప్రజోత్సవ సంవత్సరం

# జమీన్ రైతు

ESTD. 1930
Regd. No. H. NL. 18
సంపుటి 60 సంచిక 26
23-6-1989
నెల్లూరు
శుక్రవారం
12 పేజీలు రూ 1.50

స్థాపకులు: నెల్లూరు వెంకట రామానాయుడుగారు
మేనేజింగ్ ఎడిటర్: నెల్లూరు శ్రీరామమూర్తి

## చెన్నారెడ్డికి పిసిసి పీఠం అప్పగించడం.....

# కోరి కొరివితో తల గోక్కున్నట్లయింది!

కొండనాలుకకు మందేస్తే ఉన్ననాలుక ఊడిపోయిందన్న సామెతగా తయారైంది, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారం. పిసిసిలో క్రమశిక్షణారాహిత్యం రాజ్యం చేస్తున్నదని; నాయకులమధ్య సమన్వయం, పరస్పర సహకారం లోపించిందని; పిసిసి నేత నేదురుమల్లి జనార్దనరెడ్డి అన్నివర్గాల వారినీ కలుపుకుని పనిచేసుకోలేక పోతున్నారని భావించి ఆయనస్థానంలో శ్రీ మర్రి చెన్నారెడ్డిని నియమించారు.

1978 ఎన్నికలలో విజయం సాధించడంద్వారా ఆయన హస్తవాసి గొప్పతనం రుజువైందనే అభిప్రాయం ఒకటైతే, రాష్ట్రంలో అన్నిస్థాయిల పదవులు నిర్వహించిన అనుభవం పార్టీని ఈ కష్టకాలంలో గట్టెక్కించగలదనే విశ్వాసంతో ఆయన్ను పిలిచి పెద్దపీట వేశారు. అయితే చెన్నారెడ్డి వ్యక్తిత్వం, రాజకీయ శైలిని తామెంత తప్పుగా అంచనా వేశామో అధిష్ఠాన వర్గానికి ఇప్పుడు తెలిసివస్తున్నది. పిసిసిలో, పార్టీ కార్యకర్తలలో క్రమశిక్షణా రాహిత్యాన్ని నివారించడంకాక, ప్రోత్సహించడంద్వారా ఆయన తన కార్యక్రమం ప్రారంభించారు.

### ◆ హైదరాబాదు వృత్తాంతం ◆

ఆరేళ్ళ అరణ్యవాసంలో పార్టీని కని పెట్టుకొనివుండి తెలుగుదేశంరాజకీయంగానే కాక, వ్యక్తిగతంగాకూడా పీచు పగల గొట్టినా భరించి, సహించి కాంగ్రెస్ సంస్థ ప్రాభవానికి ప్రాకులాడిన నాయకులకు చెన్నారెడ్డి గడ్డిపోచంత విలువకూడా ఇవ్వలేదు. తన దేవిడీలో పడివుండి, తనకు వింజామరలు వీసేవారిని వెతికిపట్టుకొచ్చి ప్రక్కన పెట్టుకున్నారు. హైదరాబాదు సిటీలో పి. జనార్దనరెడ్డి వంటివారిని నిర్లక్ష్యంచేసి, కలతసృష్టించారు. విశ్వాసపాత్రులైన కార్యకర్తలను దూరంగాపెట్టి పార్టీలో నిరుత్సాహవాతావరణాన్ని పెంపొందిస్తున్నారు.

ఇది చాలదన్నట్లు, ఇప్పుడు ఎఐసిసి పెద్దలకే అల్టిమేటంలు జారీ చేస్తున్నాడాయన. పిసిసి అధ్యక్షులు రేపటి పార్లమెంటరీ ఎన్నికలలో పోటీచేయడానికిలేదని రాజీవ్‌గాంధీ ప్రకటిస్తే-అట్లా చెప్పడానికి నువ్వెవ్వరివని ప్రశ్నించారు చెన్నారెడ్డి. ఎఐసిసి ఆదేశాన్ని ధిక్కరించి తాను ఎన్నికలలో నిలబడవలసివస్తుందని హెచ్చరించారు. అంధ్రా వ్యవహారాల సమన్వయ కమిటీలో పివి, జలగం వంటి కేంద్ర మంత్రుల సమక్షంలో చెన్నారెడ్డి ప్రవర్తించినతీరు అందరికీ దిగ్భ్రమ కల్గించింది. ఆ సమావేశానికి అధ్యక్షతవహించిన హెచ్ కె ఎల్ భగత్ నోట మాట రాకుండా కూర్చుండిపోయాడట. ఈగందరగోళం ఫలితంగా పార్లమెంటు ఎన్నికలకు ప్రణాళిక తయారుచేయడంకోసంఏర్పాటు చేసిన ఆ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు. చెన్నారెడ్డి బృందం తాగా తిరిగివచ్చేసింది.

అధిష్ఠానవర్గానికి ఇదిగొంతులోపచ్చివెలక్కాయవంటిసమస్య. చెన్నారెడ్డినిఏవిధంగా దారికితేవాలో వారికి అర్థంకావడం లేదు. ఆయన్ను తొలగించి, వేరేవారిని ఆ పదవిలో నియమించడమనేది అసంభవమైన విషయం. ఇప్పటికే పిసిసి మార్పుల పర్వంలో పేరుకు గురైవున్నారు. ఇంతటి కలతరుసు నాయకుణ్ని పెట్టుకుని ఎన్నికలలో అందరిమధ్య సమన్వయంసాధించడమూ అసాధ్యమైనవిషయమని అర్థమైపోయింది. కోరి కొరివితో తల గోక్కున్నామని బాధపడుతున్నారు ఢిల్లీ నాయకులు. పిసిసికి చెన్నారెడ్డి పేరు

-కొరవ 7వ పేజీలో

ప్రధమ వార్షికోత్సవం

నెల్లూరు టౌను సెంటర్లో, అందుబాటైన ఛార్జీలతో, అన్ని ఆధునిక వసతులతో అలరారుతున్న లాడ్జి



హోటల్ శివప్రియ ఎ. సి.

పొగతోట సెంటర్, ట్రంక్ రోడ్-నెల్లూరు. ఫోన్: 7111 to 7115.

ప్రారంభించి 25-6-89 తేదికి సంవత్సరం నిండింది.

మమ్మెంతో ప్రోత్సహించి. సహాయ సహకారాలందించిన ఖాతాదారులు మిత్రులు శ్రేయోభిలాషులందరికి హృదయపూర్వక కృతజ్ఞతలందజేస్తూ, ఇకముందుకూడా, ఇదేవిధంగా చేయూతనందచేయమని కోరుతున్నాము. అన్నివేళలా మా శివప్రియను సంరక్షిస్తూ, అమూల్యమైన సలహాలనందజేస్తున్న శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డిగారికి మా అభివందనములు.

చెరకుపల్లి పద్మనారాయణరెడ్డి
మేనేజింగ్ పార్ట్నర్.

# అప్పుడే పార్లమెంటు అభ్యర్థిత్వాలకు ప్రయత్నం!

పార్లమెంటు ఎన్నికలు ముందుకొచ్చే సూచనలున్నాయి. రాజ్యాంగ ప్రకారం వీటిని జనవరిలో జరగాలి; కాని రెండు నెలల ముందే - అంటే అక్టోబరులోనే - జరుగుతాయని అనిపిస్తున్నది. ప్రధాని రాజీవ్ గాంధీ వలదాల్ల ప్రకటించాలనుకోండి. ఇప్పుడు జరిపే ప్రశ్నే లేదని! రాజకీయ వాతావరణం మాటలకు అర్థాలు వేరుగా వుంటాయి. సమయం అనుకూలిస్తే ముందుకలాగడం, అననుకూలమనుకుంటే వెనక్కి నెట్టడం కొత్తేమీకాదు. దేశంలోని వాతావరణాన్ని బట్టిచూసినా, ప్రధాని రాజీవ్ గాంధీ శరపరంపరగా తెస్తున్న ప్రజాహిత పథకాలనుబట్టి, ఆయన పర్యటనల ప్రసంగాలనుబట్టి లోక్‌సభ ఎన్నికలు అక్టోబరులో జరుగుతాయనే అభిప్రాయాన్ని కల్గిస్తున్నది. మొన్న రాజీవ్‌గాంధీ తిరుపతికి వచ్చినప్పుడు ఈ వూహాగానం గుప్పుమని పొక్కింది!

ప్రధాని అప్పుడే రెండుసార్లు మన రాష్ట్రంలోని మూడుజిల్లాలు సందర్శించారు; మొదటిసారి కడప, తిరుపతి సభల్లోను, 31తేది నిజామాబాద్ సభలోను ప్రసంగించారు. వివిధ రాష్ట్రాలు ప్రధానులకు పోటీ వస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఆయన పాదంమోపి ప్రసంగించి మోత పుట్టించబోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఆ రాష్ట్రంలో ప్రతిసారి కాలేదు పర్యటించారుగదా! అనేవిధంగా అన్ని రాష్ట్రాలను ఆయన చూడబోతారు.

## ఒంగోలుసీటుకు గిరాకి ఎక్కువగా వుండేట్లుంది!

రాజీవ్‌గాంధీకి రేపటి లోక్‌సభ ఎన్నికల రాష్ట్రజయం సమస్య. అందువల్ల ఆయన తేలిగ్గా వదలిపెట్టరు. ఆ విజృంభణ అప్పుడే కొట్టవచ్చినట్లు కనబడుతున్నది. మనరాష్ట్రంలో మూడుజిల్లాల ఆయన ప్రసంగధోరణి పరిశీలిస్తే ఈవిషయం విదితమవుతుంది. రాజీవ్‌గాంధీ పూర్వం ఎన్నడూ ముఖ్యమంత్రి రామారావును గాని, ఆయన ప్రభుత్వాన్నిగాని ప్రత్యక్షంగా విమర్శించలేదు. అటువంటిది మొన్నటి సభల్లో పేరుచెప్పి దాడి చేసి వదలిపెట్టాడు. రామారావు పథకాలను పేర్లుమార్చి ప్రజలను మోసంచేస్తున్నారన్నారు; తెలుగుదేశం ప్రభుత్వంవల్ల ముందుండిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు అన్ని రాష్ట్రాలకంటే వెనుకబడిపోయిందని ఆయన కుండ బద్దలుకొట్టినట్లు చెప్పారు. ఈ నిశిత విమర్శలనుబట్టి ప్రధాని ఎన్నికల రణభేరి మ్రోగించారనేది స్పష్టం.

వ్యక్తిగతంగా ప్రధాని రాజీవ్‌పై వున్న వ్యతిరేకత, విముఖత క్రమంగా సమసిపోయాయి. బోఫోర్స్ గిఫోర్స్ ఆరోపణలు అపవాదులు అదృశ్యమయ్యాయి. దశలదశలుగా ఆర్భాటంగా ప్రారంభమై ఈసారి రాజ్యం తమదే నన్న భ్రమను ప్రజలలో కల్గించుకున్న నేషనల్ ఫ్రంటు అంతఃకలహాలతో, నాయకుల స్వార్థాలతో, విభేదాలతో ప్రతిష్ఠను, బలాన్ని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. అది కాంగ్రెస్‌కు ఏనాటూ ప్రత్యామ్నాయం కాజాలదనే దృఢాభిప్రాయం ప్రజలలో నాటుకుంది. ఈ సమయాన్ని గమనించిన ప్రధాని రాజీవ్‌గాంధీ ఆకర్షణ పథకాలతో ముందడుగు వేశాడు, ప్రజలమధ్యకు

—కొరవ 10వ పేజీలో

## పినాకిని తీరం

### వీరులను సంస్మరిద్దాం!

మొన్న 4 తేది వెన్నెలకంటి రాఘవయ్యగారి జయంతి గిరిజన హాస్టల్‌లో నిశ్శబ్దంగా జరిగిందంటే నాకు కొంత కొరతగా వుంది. అది గిరిజన హాస్టల్‌లో అంత పరిమిత పరిధిలో గిరిజన నాయకులచేత జరపబడవలసిన సభా? రాఘవయ్యగారు కేవలం యానాదులు, ఆదిమజాతులకు సేవ చేసినవారుగానే నిబద్ధించబడవలసినవారా? ప్రతి కాంగ్రెస్‌వాది, ప్రతి దేశభక్తుడు సంస్మరించదగిన, పూర్తిజం పొందదగిన మహావ్యక్తి కాదా ఆయన?

రాఘవయ్యగారు 'క్రిమినల్ ట్రయిబ్' పేర అణగదొక్కబడుతుండిన యానాదులు ఎరుకలవంటి గిరిజనులపాలిట ప్రత్యక్షదైవమే. ఆయన తన జీవితాన్ని వారి సముద్ధరణకు అంకితం చేయకుంటే యానాదిజాతి ఏ స్థితిలోవుండేదో, ఏమై వుండేదో? వారికి సంఘంలో సముచితస్థాయి, స్థానం, గౌరవం కల్గించినవారు రాఘవయ్యగారు. యానాదులపునరుద్ధరణకృషిలో రాఘవయ్యగారు ఎన్ని ప్రతిబంధకాలు ఎదుర్కోవలసివచ్చిందో, ఎందరు భూస్వాములకు విరోధం కావలసివచ్చిందో చెప్పలేము. చిత్తశుద్ధికలవారు కాబట్టి, ఆత్మస్థైర్యం కలవారు కాబట్టి, నెల్లూరు నుంచి ఢిల్లీ వరకు పోయి పోరాడగలిగిన ధీమా గలవారు కాబట్టి, న్యాయం తనపక్షాన వున్నదికాబట్టి, కాలం తనకు అనుకూలంగా మార్చుకొందిం కాబట్టి ఏకాకిగా ఆయన ఈ వ్యతిరేకతలన్నింటినీ అధిగమించి, తన లక్ష్యాన్ని విజయవంతంగా సాధించుకోగలిగారు. రాఘవయ్యగారు స్వభావరీత్యా పేదల పక్షపాతి; అందువల్లనే ఆయన వ్యవసాయకూలీ వుద్యమాలనుకూడా చేపట్టగలిగారు. రాఘవయ్యగారు కట్టె కాంగ్రెస్‌వాది, గాంధేయుడు. కాని రష్యా విప్లవం ఆయనమీద చెరగని ముద్రవేసిందేమో. ఇంటిలోని ఆయన ఆఫీసు గదిలో గోడకు లెనిన్ చిత్రపటం ఆయన జీవితాంతంవరకు వ్రేలాడుతుండేది. కాని, విచిత్రం. ఆయన కమ్యూనిస్టుల బద్ధవిరోధి.

యానాదులు, ఆదిమజాతుల సేవ రాఘవయ్యగారి జీవితంలో ఒకభాగమైతే, దానికి మించింది స్వాతంత్ర్యపోరాటంలో ఆయన పాత్ర. విప్లవవాదిగానే రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. గాంధీజీ ప్రభావంతో మారిపోయాడు. పిస్తోళ్ళుపట్టారు. ఆ చేతులతోనే త్రివర్ణపతాకాన్ని ఎత్తుకున్నారు. 1920 ప్రాంతంలో నే ప్రారంభమైంది ఆయన పోరాటజీవితం, ప్రతిఉద్యమంలో జైలుకు పోయాడు;

-కొరవ 8వ పేజీలో


రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు గొప్పసదవకాశం!

# కేవలం రూ. 250/-లు చెల్లించి

(ఫైనాన్స్ మరియు హ్యాండ్లింగ్ ఛార్జీల నిమిత్తం)

# అవంతి మోపెడ్ పొందండి.

*లైఫ్ టాక్స్ రిజిస్ట్రేషన్ ఇన్సూరెన్సులతో

*36 సులభవాయిదాలలో చెల్లించే సౌకర్యం.




# శ్యామ్ బ్రదర్స్

నెం.1, ఆచారిస్ట్రీట్, నెల్లూరు.

SOLD & SERVICED BY

Expo Machinery Limited 40-7-6/A, DONKA ROAD, MOGALRAJAPURAM, VIJAYAWADA-520 010. PHONE: 63796

# మంచి కూరగాయల విత్తనాలు ఎట్లా ఉత్పత్తి చేసుకోవాలి?

పి. వీరన్నగౌడ్
(అసిస్టెంట్ ప్రొఫెసర్,
రాజేంద్రనగర్)

మన దిక్కుదినంలో కూరగాయలు ఎంతో ప్రాముఖ్యతని సంతరించుకొన్నాయి. జీవన ప్రక్రియలకు అవసరమగు శక్తిని సమకూర్చడమేగాక, ఖనిజ లవణాలు, విటమిన్లు అనే పోషక పదార్థాలనుకూడా అందజేస్తాయి. జీర్ణక్రియలో విలువైన ఆమ్లాలను తటస్థీకరించడంతో పాటు, జీర్ణశక్తినికూడా అధికం చేస్తాయి. వశ్యదినుసుల కుటుంబానికి చెందిన కూరగాయలు కార్బోహైడ్రేటులు, ప్రోటీన్లను; ఆకుకూరలు ఇనుము, కాల్షియం వంటి పదార్థాలను విరివిగా కలిగివుండి మన ఆరోగ్యానికి ఎంతో తోడ్పడుతాయి.

విజయవంతంగా కూరగాయల పెంపకానికి వమ్మకమైన, నాణ్యతకల్గిన విత్తనాన్ని ఎంపిక చేసికోవడం ఎంతైనా అవసరం. నాణ్యతలేని విత్తనాన్ని వాడి రైతు ఎంతో శ్రమ, శక్తి, నైపుణ్యం ప్రదర్శించినా అధిక దిగుబడిని పొందలేడు. అయినా మన రైతులు ఈ విషయానికి అంత ప్రాముఖ్యత ఇవ్వడంలేదు. సమయానికి అందుబాటులోవున్న విత్తనాన్ని సంపాదించి కూరగాయలను పెంచడాన్ని చాలా మంది రైతులు ఇప్పటికీ పాటిస్తున్నారు. అందువల్ల అధిక దిగుబడులను సాధించడం వీలుకావటంలేదు. ప్రస్తుత పంట, పెరుగుతున్న జనాభాకి సరిపోయినంత లేదు. ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రతి మనిషికి రోజుకు 285 గ్రాముల కూరగాయలు అవసరంకాగా, ప్రస్తుతం సరాసరి వినియోగం 100 గ్రాములకంటే తక్కువగావుంది. కాబట్టి కూరగాయల వుత్పత్తి అధికం చేయవలసిన అవసరం ఎంతైనావుంది. ఇది మంచిరకం, నాణ్యత

-తొరవ 11వ పేజీలో

# వేదాయపాళెం రైల్వే స్టేషన్, ఎకెనగర్ పోలీసు స్టేషన్- పోరు ఇప్పుడే మొదలుకావాలి!

నెల్లూరుటవున్ పెరిగిపోతున్నదిగాని, దానికి తగినట్లు సౌకర్యాలుమాత్రం పెరగడంలేదు మునిసిపాలిటీ చేయాల్సిన పనులేకాదు; రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల పరంగా జరగవలసిన పనులూ జరగడమే లేదు. కొన్ని విషయాల్లో యాభైఏళ్ళనాటికి, నేటికి పరిస్థితిలో మార్పేలేదు ముఖ్యంగా రెండు విషయాలు ఇక్కడ ప్రస్తావిస్తాము రైలు సౌకర్యం విషయం తీసుకోండి. అర్ధశతాబ్దం నాటికి ఈనాటికి మార్పు ఏమైనావుందా? అభివృద్ధి ఏమైనా వుందా? అదేవిధంగా పోలీసుల భద్రతా ఎక్కువైందా? లేదులేదు అని తప్ప ఇంకేమి సమాధానం చెప్పుకోడానికి అవకాశముంది?

టవున్ విస్తీర్ణం పెరిగింది, జనాభా ఎక్కువైంది. ఈ రెండింటి పెరుగుదల పూర్వంకంటే ఎన్నోరెట్లు ఎక్కువ. 1988 ప్రాంతంలో నెల్లూరు జనాభా ఎంత వుండేది? లక్షకూడా వుండదు! విస్తీర్ణం ఎంత వుండేది? ఇప్పటిదానిలో నాలుగో వంతుకూడా వుండదు. టవున్ అంత చిన్నదిగా వున్నప్పుడే ఉత్తరపు చివర వుండే నెల్లూరు రైల్వేస్టేషన్ చాలదని, దక్షిణ నెల్లూరువాసులసౌకర్యార్థం 'నెల్లూరు సౌత్' పేరుతో మరోస్టేషన్ నెలకొల్పారు. ఎక్స్‌ప్రెస్, మెయిల్ బండ్లు తప్ప ప్యాసింజర్ అన్నీ నెల్లూరు సౌత్‌లో నిలిచేవి. పూర్వం ప్రయాణం ప్యాసింజర్ రైళ్ళలోనే ఎక్కువగా వుండేది. అందువల్ల పెద్ద స్టేషన్లో ఎంతమంది ప్రయాణీకులు దిగేవారో, అంతకంటే ఎక్కువమంది సౌత్ స్టేషన్లో దిగేవారు. అంటే సౌత్ స్టేషన్ నెల్లూరు పౌరులకు అంత అందుబాటుగా, సౌకర్యంగా వుండేదన్నమాట.

రైళ్ళసంఖ్య, నిడివిపెరిగి, రైళ్ళలో అత్యధికభాగం ఎక్స్‌ప్రెస్‌లో, సూపర్ ఫాస్ట్ రైళ్ళుగానో మార్చబడి, ప్యాసింజర్ రైళ్ళసంఖ్య తగ్గిపోయినతర్వాత నెల్లూరు సౌత్ వుపయోగము, ప్రాముఖ్యత తగ్గిపోయింది. అక్కడ అండర్ బ్రిడ్జి వచ్చిన తర్వాత అసలు సౌత్‌స్టేషన్ అనేది ఒకటి వుందా అనిపిస్తున్నది. అది ప్రయోజన శూన్యమైంది. అది నామమాత్రపు స్టేషన్ అయిపోయింది!

> **నెల్లూరు టౌన్
> యాభైఏళ్లనాడు
> వున్నట్లే వుంది-
> మార్పులేదు!**

ముఖ్యమైన రైళ్ళన్నీ ఆగేది పెద్ద స్టేషన్లో. అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా అక్కడికే పోవాలి. ప్రస్తుతం నెల్లూరు మునిసిపల్ లిమిట్స్ ఉత్తర దక్షిణాల మధ్యదూరం పది పన్నెండు కిలో మీటర్లుంటుంది. అంటే దక్షిణాన అయ్యప్ప దేవాలయం వద్ద కాపురముండేవాడు రైల్వే స్టేషన్‌కు పోవాలంటే కనీసం పది కిలో మీటర్లయినా ప్రయాణం చేయాలన్న మాట! పది కిలోమీటర్లు పోవడానికి ఎంత టైం పడుతుంది? రవాణాఛార్జీలు ఎంత అవుతాయి? ప్రయాసఎంత? ఈ సమస్యను గూర్చి ఎవరైనా ఆలోచిస్తున్నారా?

టవున్ దక్షిణంగానే పెరిగిపోతున్నది! మధ్యమధ్యలో వెళ్తున్నా చెముడుగుంట

-తొరవ 8 వ పేజీలో

# వంట్లో ఊపిరున్నంతవరకు నెఫ్జాసుందరరామిరెడ్డిలో ఉత్సాహం తరిగేట్లులేదు!

వయస్సు పెరిగిపోయింది; నరాలలోని అనారోగ్యం వంట్లోని శక్తినంతా పీల్చి పిప్పిచేసేసింది. పక్షవాతం కుట్టరికం చేస్తున్నది. కర్రతోడు లేకుండా నడవలేడు; పదినిముషాలనిలబడలేడు. అయినా నెఫ్జా సుందరరామిరెడ్డికి, తన సంస్థ వార్షికోత్సవాలంటేసరికి వెయ్యి ఏనుగుల బలం వచ్చేస్తున్నది.

కేవలం ఒకవ్యక్తి, వ్యక్తిగతఉత్సాహం, పట్టుదలతో నడిచే 'నెఫ్జా' వంటి సంస్థలు పాతికేళ్ళపాటు నిరాఘాటంగా మనుగడ సాగించడమే ఆశ్చర్యకరమైన విషయం ఒకవేళ నడిచినా - ప్రారంభం నాటి వెలుగు తలుగుడు క్షీణించి తవవ్వ వంలా మిగిలిపోవడం మామూలు. కాని నెఫ్జా విషయంలో మాత్రం ఆ రోంటికి ఓటింగా మినహాయింపేనని చెప్పాలి. పైగా, ఇదేమి నిధులు, ఆస్తులువున్న సంస్థకాదు. ఎప్పటికప్పుడు, ఆ రోజుకి లోకంలోని ప్రముఖులైన వ్యక్తుల దయాదాక్షిణ్యాలపై నడిచే సంస్థ.

మొన్న 10 నేది, నెఫ్జా ఆనవాయితీగా నిర్వహించే సంగీత నృత్య కళాపరిషత్‌ను నిర్వహించారు సుందరరామిరెడ్డి. సంగీతం నృత్యం పోటీలలో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్‌తోపాటు, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాలనుండి 600 మంది కళాకారులు వచ్చారు. రెండు రోజులపాటు టౌన్‌హాల్లో జరిగాయి ఈ పోటీలు.

తొలిరోజు డాక్టర సంజీవరావు అధ్యక్షించారు; నృత్యదర్శకుడు శ్రీ సురేష్

> **సింహపురి**

కాలు పోటీలు ప్రారంభించారు. 11 నేది బహుమతి ప్రదానోత్సవ సభ. శ్రీ జె. ఎల్. నారాయణ అధ్యక్షత వహించారు. సినిమా సంగీతదర్శకుడు శ్రీ శివాజీరాజా, సినిమానటి కుమారి జయశీల పాల్గొన్నారు.

బహుమతుల వివరాలివీ.

కూచిపూడి - వి. భవాని (నెల్లూరు) ఎల్. వి. కాంతుబ్రహ్మణ్యం, డి. స్వాతి; జూనియర్స్- కె. సునీత, షేక్ షీమా, వి. మధు'మ; భరతనాట్యం- వి. భవాని,

-తొరవ 8వ పేజీలో




# జిల్లావార్తలు

(5వ పేజీ తరువాయి)

విద్యార్థుల పరిస్థితి మారిపోతుంది. వ్యక్తిత్వం అధ్యాపక వృత్తిలో విజ్ఞత లేని ఈ చేష్టలను గుర్తించి. విజ్ఞానికి తగిన అర్హతలు కలిగిన వ్యక్తులు కాకపోవడంవల్ల, ప్రిన్సిపాల్స్ ఎక్కువకాలం ఆపదవిలో నిలువలేకపోతున్నారు. రాజీవ్‌గాంధీ ముఖ్యమంత్రులను మార్చినట్లు ప్రిన్సిపాల్స్‌ను మార్చివేయడం వల్ల అధ్యాపకుల్లో, విద్యార్థుల్లో క్రమశిక్షణారాహిత్యం రాజ్యమేలుతున్నది. పరిపాలన అస్తవ్యస్తమైపోయింది. ఈమధ్య ఒకవిద్యార్థి ఈ కాలేజీలో పాఠాలు సరిగా చెప్పడంలేదని, 180 రోజులు పనిచేయడం లేదని జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదుకూడా చేశాడట.

రెక్టార్ శ్రీ రామచంద్రారెడ్డికి తన కాలేజీ ప్రిన్సిపాల్‌గా వచ్చేవ్యక్తి ఎంతో ఆదర్శప్రాయుడుగా వుండాలని ఆకాంక్ష. తాను కోరుకునే వ్యక్తి ఇంకా ఎక్కడా దొరకనందువల్లనా ఈమార్పులు?

ఇప్పటివరకు ఆయనకోరిన వ్యక్తులే ప్రిన్సిపల్స్‌గా నియమితులైనారు. ఇప్పుడు కాలేజీ సర్వీసుకమిషన్ జోక్యంచేసుకొని ఆదేకాలేజీలో 25 సంవత్సరాలుగా జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీ జి. గోపాలకృష్ణమూర్తిని నియమించింది. తాను కోరి తెచ్చుకున్నవారితోనే పొత్తుకుదుర్చుకోలేని రెక్టారుకు ఇది మింగుడుపడని సమస్య. గోపాలకృష్ణమూర్తికూడా ముక్కుకు సూటిగాపోయే వ్యక్తే.

ఇదిట్లావుంటే అసలు రామచంద్రారెడ్డి గారి అధికారానికి ఎసరుపెట్టి, పబ్లిక్ ప్రముఖులైన శ్రీ నూనె సుబ్రహ్మణ్యంను రెక్టార్‌గా నియమించాలని కాలేజీ కమిటీ తీర్మానించిందట.

మొత్తంమీద కావలి జవహర్‌భారతిలో ఎప్పుడూ ఏదో ఒక గొడవ వుండడం సర్వసాధారణమైపోయింది. దానికి ఆస్కారం లేకుండా ఎందుకు చేసుకోలేకపోతున్నారో శోచనీయంగావుంది. ఏమైనా రామచంద్రారెడ్డిగారు ఆ సంస్థకు జనకుడు; దానిని పెంచి, పెద్దజేసి, గుర్తింపు సంపాదించిన వ్యక్తి. అటువంటి వ్యక్తిని రెక్టార్‌గా తీసివేయడానికి ఆ కమిటీకి ఎట్లా తోచిందో మరి! పెద్దలెవరైనా ఈ గొడవలను సామరస్యంగా పరిష్కరించడం ఆ సంస్థ శ్రేయస్సును కోరేవారి అభిలాష.

### ఆత్మకూరు కరెంటు మొరలకు కమిటీ

ఆత్మకూరు సహకార విద్యుత్‌సంస్థ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు తమ కరెంటుబాధలు అధికారులకు విన్నవించడానికి ఒక కమిటీని ఎన్నుకున్నారు. దీనికి శ్రీ ఎం. శంకరయ్య గౌరవాధ్యక్షుడు; వర్కింగ్‌కమిటీ అధ్యక్షుడుగా శ్రీ గంగా శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యక్షుడుగా శ్రీ సి. వి. గిరిధర్‌నాయుడు, కార్యదర్శిగా శ్రీ కమతం జయరాం ఎన్నికైనారు.

కనీసం రోజుకి 18 గంటలైనా కరెంటు సరఫరాచేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలవల్ల సరఫరాకు అంతరాయం కలగకుండాచూడాలని, మోటార్లు కాలిపోకుండా కాపాడాలని వీరు విద్యుత్‌సంస్థ ఎం.డి.ని కోరుతున్నారు.

### కావలికి కొత్తకమీషనరు

కావలి మునిసిపాలిటీకి కొత్త కమీషనర్‌గా, శ్రీ పి. దీనదయాళ్ ఛార్జి తీసుకున్నారు. దీనదయాళ్ కావలికి పాతకాపు క్రిందే లెక్క. ఆయన గతంలో చిలకలూరిపేట కమీషనర్‌గా, దేశం నాయకుల ఆగ్రహానికిగురై, అన్యాయమైన, అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. కాని, కోర్టు న్యాయంచేసింది; మళ్ళీ ఉద్యోగం సంపాదించాడు. అయితే చిలకలూరిపేట పెనంమీదనుంచి కావలి పొయ్యిలోకి వచ్చిపడిన దీనదయాళ్, ఇక్కడి ముఠాకుమ్ములాటల బెడదనుండి ఎట్లా తప్పించుకుంటాడో చూడాలి!

### వాసిలి వరదరాజస్వామి నుదుట వ్రాత మారినట్లుంది!

ఆత్మకూరు తాలూకా వాసిలి గ్రామంలోని వరదరాజస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయట. గ్రామ చరిత్రలో ఇంత ఘనంగా ఎప్పుడూ బ్రహ్మోత్సవాలు జరగలేదట. ఈ వైభవం చూస్తుంటే, మా వరదరాజస్వామి నుదుటివ్రాత మారైనా వుండాలి లేదా దశ తిరిగైనా వుండాలనిపిస్తున్నదంటున్నారు, శ్రీ సుందరబాలయ్య, దేవుడిదశ తిరిగితే మనకేమిటి లాభం. దానితోపాటు గ్రామం దశకూడా తిరిగితే సంతోషపడండి.

### దుత్తలూరు తిరునాళ్ళ

ఉదయగిరి తాలూకా దుత్తలూరు వెంగమాంబ దేవస్థానం తిరునాళ్ళ 25 తేది నుంచి జరుగుతుంది. ఈ సందర్భంగా దేవాలయం ఆవరణంలో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించబోతున్నారు.


Phone : 5521

డా॥ సి. వి. రామన్

## కాలేజ్ ఆఫ్ సైన్సెస్

వి. ఆర్. కాలేజీ దగ్గర, నెల్లూరు-3.

1989 మార్చి నెలలో జరిగిన జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ పరీక్షలలో ఘనవిజయం పొందిన మావిద్యార్థినీ విద్యార్థులకు మాఅభినందనలు. ఈ స్ఫూర్తితోనే ఈ విద్యా సంవత్సరం జూనియర్, సీనియర్ ఇంటర్ క్లాసులను ప్రారంభించుచున్నాము.


జూనియర్ ఇంటర్-క్లాసులు 1-7-89 న
సీనియర్ ఇంటర్-క్లాసులు 1-7-89 న
ప్రారంభించుచున్నాము.

జూనియర్ ఇంటర్ :- పదవతరగతిలో ఎక్కువశాతం మార్కులురాని విద్యార్థులకు

- కాలేజీల్లో సీటురావని మీరు బాధపడనవసరం లేదు.
- పెద్ద పెద్ద మొత్తాలు ఖర్చుపెట్టి రెసిడెన్షియల్ కాలేజీల్లో చేరనవసరంలేదు
- ఏదో ఒక గ్రూపు చేరి మీరు నష్టపడవద్దు.
- మీరు కోరిన గ్రూపు (M P C లేక Bi. P C)లో చేరి మీ ఆశలు నిజం చేసుకోవచ్చు.
- Board of Intermediate education వారు కల్పిస్తున్న Exemption సౌకర్యముతో సులభముగా ఇంటర్ పరీక్షలకు హాజరు కావచ్చును
- Exemption సౌకర్యము గురించి మిగతా వివరములకు మమ్మల్ని సంప్రదించండి

ఇట్లు
కె. మధుసూధనరెడ్డి M.Sc.,
డైరెక్టర్


# ఉత్తర క్రియలు



మా అభివృద్ధికి మూలపురుషుడు

## జిలుమూడి వెంకటరమణారెడ్డిగారు

14-6-89 తేది ఉ॥ 7-30 గం॥కు స్వర్గస్థులైనారు.
వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తున్నాము.

### వారి ఉత్తర క్రియలు 28-6-89 తేది బుధవారం

దువ్వూరులోని వారి స్వగృహమునందు జరుగును.
కావున బంధు, మిత్రులకు తెలుపడమైనది.

భార్య : వెంకమ్మ      వదిన : శ్రీనివాసమ్మ

అన్నకుమారులు - కోడళ్ళు : జిలుమూడి రామిరెడ్డి-పద్మావతి;
జిలుమూడి చంద్రశేఖరరెడ్డి-కళావతి; జిలుమూడి మల్లికార్జునరెడ్డి-సుజాత;
జిలుమూడి శివకోటారెడ్డి-అనూరాధ; జిలుమూడి సుబ్రహ్మణ్యంరెడ్డి-మంజుల;

అన్నకుమార్తెలు - అల్లుళ్ళు : వంచేరు విశలేశ్వరమ్మ-పట్టాభిరామిరెడ్డి;
మేదరమెట్ల రమణమ్మ-మల్లారెడ్డి; కావుపాని లక్ష్మి-బి. సి. కృష్ణారెడ్డి;
అనం హిమవతి-వివేకానందరెడ్డి.

మరియు మనుమలు - మనుమరాళ్ళు

Edited, Printed & Published by N. Dolendra Prasad at the Zamin Ryot Press, - Nellore 524 001